# 19. తెలివి గలోడు.....

మెరిట్లో సీటు సంపాదించుకోవడానికి ఇంటలీజెంటుకాదు—డొనేషన్లుకట్టో, రికమండేషన్లతోనో సీటుపొందే సామర్థ్యమూలేదు_ అయినా మెడిసిన్ సీటుకొరకై పదేపదే ప్రివేశ పరీక్షరాసే విద్యార్థిలా మళ్ళీ చెట్టు దగ్గరికెళ్ళాడు ఆంజనేయులు — చెట్టెక్కి శవాన్ని భుజంపై వేసుకొని చెట్టుదిగి శ్మశానం దిక్కు పరుగెత్తినట్టుగా నడుస్తున్నాడు—అతని వాలకాన్ని చూచి భేతాళుడు—

"ఓ మనిషీ! నీ ముఖంచూస్తుంటే నువ్వు పరుగెత్తి పాలుదాగబోయి బోర్లపడ్డవాడిలా కనబడుతున్నావు —వ్యాపారంలో దివాలా తీసావనుకుంటాను —ఇది స్వకార్యఫలితమా —? మనిషి కొంటెతనమా...? దైవ ఘటనా — ? చెప్పు—" అన్నాడు—

"దైవం సంగతేమో కాని ఈ సమాజంలో మనిషే పెద్దప్రమాదకారి-చిన్న చిన్న వ్యాపారాలతో జీవితం ప్రారంభించాను-తూచడంలో కొలతలో మోసంచేసాను—నూటికి నెలకు పది చొప్పున వడ్డీకిచ్చి సంపాదించాను—భూములు కుదువబెట్టుకొని జప్తు చేసుకున్నాను-మరెన్నో విధాలుగా రెండు చేతులా డబ్బు సంపాదించాను— డబ్బు సంపాదనలో పాపమన్ని చూల్లేదు ఎవరిపై కనికరం చూపలేదు—డబ్బు— డబ్బు— డబ్బు—విపరీతంగా సంపాదించాను — నేనే గొప్ప తెలివికలవాన్నని భావించాను-నాకెదురన్నది లేదని మురిసిపోయాను-అయితే రెడ్డినన్ను భాగస్వామిగా చేసుకొని నిండాముంచాడు—నేనిన్నాళ్ళుగా సంపాదించిం

దంతా గంగపాలైంది — ఎందరికో టోపిపెట్టిన నాకు రెడ్డి పెద్దటోపి పెట్టాడు—నన్ను మోసం చేసాడు– నన్ను రోడ్డుపై నిల్చోబెట్టాడు— నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించిన నాపై ఊరివాళ్ళు కనీస సానుభూతి కూడా చూపడంలేదు—నాకేం తోచడంలేదు—ఇక నాకు చావే శరణ్యమనుకుంటున్నాను—ఆఖరి ప్రయత్నంగా భేతాళున్ని స్వాధీనపరచుకోవాలనుకుంటున్నాను— " తనలో తాననుకుంటూ శ్మశానం దిక్కు వేగంగా నడుస్తున్నాడు అంజనేయులు...

"మనిషీ! నీ ప్రయత్నం చెప్పనంటావు—అయినా ఫర్వాలేదు– త్రోవతొందరగా కరిగిపోవడానికి నీకో కథ చెబుతాను— " అని కథ చెప్పడం ప్రారంభించాడు భేతాళుడు....

అది మహర్షులు పుట్టినభూమిగా — మహనీయులు అడుగుపెట్టిన నేలగా పుణ్యస్థలాలున్న స్థలంగా పేరుపొందిన దేశం—అయితే అక్కడ చిన్నచేపను పెద్దచేప తినే న్యాయమే అమల్లోవుంది–ఒకరు ఇంకొకర్ని మోసంచేసి తాను తెలివికలవాన్నని భావిస్తాడు — అతన్ని మరొకడు మోసంచేసి ఇంకా తెలివికలవాన్ననుకుంటాడు. అక్కడ పేదప్రజలకు రైతులను షావుకార్లు దోస్తారు — వాళ్ళను గ్రామాధికార్లు దోస్తారు— వాళ్ళను ఆ పైఅధికార్లు —వాళ్ళను వాళ్ళపై ఉన్నవాళ్ళు– ఇలా దోపిడి నేది చెయిన్ రియాక్షన్‌లా సాగిపోతూనే వుంటుంది–అది న్యాయ సమ్మతంగానే చట్టబద్ధంగానే ఉన్నట్టు చలామణవుతుంది —

అలాంటి దేశంలోని ఓ గ్రామంలో పుట్టాడు శేషగిరి—పుట్టింది పూరిగుడిసెలోనే-తల్లిదండ్రులు మెట్రిక్ వరకు చదివించారు—చిన్న

ప్పట్నుంచే తెలివైన వాడనీ పేరు తెచ్చుకున్నాడు—ఊళ్ళో భూస్వామి ఆశ్రియం సంపాదించాడు—సర్పంచ్‌కు దగ్గరయ్యాడు—పట్వారీ కను సన్నట్లో మెదిలాడు—పోలీసు పటేలుకు తలలో నాలుకయ్యాడు- మెల మెల్లగా పైరవీలు చేయడం ప్రారంభించాడు—బ్లాక్ ఆఫీసులో, ఎల్. ఎం బి. లాంటి బ్యాంకుల్లో కొందర్ని పరిచయం చేసుకున్నాడు-పైరవీల కింద పర్సెంటేజి తీసుకుంటూ ఋణాలిప్పించడం లాంటి పనులు చేశాడు పోలీసుస్టేషన్లలో పరపతి సంపాదించుకొని పైరవీలు చేసాడు— ఇలా రకరకాల పనులుచేసి కొంత డబ్బు సంపాదించాడు—ఊరికీ కారోబా రయ్యాడు—పంచాయతీ ఫండును తెలివిగా మింగేసాడు-ఇంటిపన్నులు వసూలుచేసి స్వాహా అనిపించాడు-మరెన్నో దందాలుచేసి మరింత డబ్బు సంపాదించాడు-

తర్వాత ఎన్నికల్లో శేషగిరి సర్పంచయ్యాడు-డబ్బుదాహం మరింత పెరిగింది-ఇంకా ఇంకా సంపాదించాలనుకున్నాడు-తన తెలివికి తనను అభినందించుకున్నాడు— అయితే మొదలేమాత్రం ఆస్తిపాస్తులులేని శేషగిరి ఇలా అంచెలంచెలుగా ఎదిగి ధనవంతుడు కావడం...ఆ ఊరి భూస్వామికి నచ్చలేదు శేషగిరిని దెబ్బతీయాలని సమయం కొరకెదురు చూస్తున్నాడు- భూస్వామి కొడుకు వ్యాపారంలో భాగస్వామి కమ్మని శేషగిరికి పిలుపొచ్చింది-మరింత డబ్బు సంపాదించాలన్న ఉద్దేశ్యంతో శేషగిరి భూస్వామి కొడుకుతో పట్నంలో వ్యాపారం ప్రారంభిం చాడు-తాను ఇన్నాళ్ళు సంపాదించిన డబ్బంతా అందులో పెట్టుబడిగా పెట్టాడు-అయితే శేషగిరి ఏ భూస్వామి కొడుకునైతే నమ్మాడో అతడా తన్ని నిలువునా ముంచేసాడు-అతన్ని మోసగించి వాటాను స్వాధీనం

చేసుకొని కట్టుబట్టలతో శేషగిరిని నడివీధిలో నిలబెట్టాడు — తన పరిస్థితిని తెలుసుకొని షాక్ తిన్నాడు శేషగిరి=

చెప్పడం ఆపి భేతాళుడు

ఈ కథవల్ల తెలుసుకోవాల్సిన నీతిఏంటి--?

ఈ ప్రశ్నకు జవాబు తెలిసీ చెప్పకపోతే నిన్ను-అన్నాడు భేతాళుడు-

"దాదాపు నా కథలాంటిదే చెప్పి నాతో జవాబులు చెప్పించి మాయం కావాలని చూస్తున్నాడు--అయినా జవాబులు చెప్పక తప్పదు-"అనుకొని జవాబులు చెప్తున్నాడంజనేయులు--

"తానే తెలివికలవాణ్నని భావించిన శేషగిరి తనకంటే తెలివి కలవాళ్ళుంటారని తెలుసుకోకపోవడంవల్ల మోసపోయాడు-ఈ కథవల్ల తాడితన్నేవాన్ని తల తన్నేవాడుంటాడని గమనించాలని, మోసమే నీతిగా చలామణి అవుతున్న ఈ సమాజ స్వరూప స్వభావాలను తెలుసుకొని ప్రవర్తించాలని, లేకుంటే తానెంత తెలివికలవాడైనా మోసపోయే అవకాశముందన్న నీతి నేర్చుకోవాల్సింది—"

అంజనేయులుకు మౌనభంగం కాగానే శవంతోసహా మాయమై మళ్ళీ చెట్టెక్కాడు భేతాళుడు.

[ఈ పక్షంలో 1987]